క్లుప్తంగా

చెంచుల ఆర్థిక ప్రగతి సర్వే పరిశీలన



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పగిడ్యాల: చెంచుల ఆర్థిక స్థితిగతులపై జరుగుతున్న సర్వేను ఎంపీడీఓ సుమిత్రమ్మ మంగళవారం పరిశీలించారు. స్థానిక చెంచుకాలనీని సందర్శించి వారి ఆర్థిక ప్రగతిపై విచారించారు. ఆర్థిక ప్రగతి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సర్వే బృందాన్ని ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయం–2 పరిధిలోని రైతు సేవా సెంటర్‌ను పరిశీలించి రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, సచివాలయ కార్యదర్శి సత్యమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



డాక్టర్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

జూపాడుబంగ్లా: 104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జీఓ నంబర్–7 ప్రకారం వేతనాలు చెల్లించాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ ప్రవీణ్, పైలెట్ సతీష్‌కుమార్ కోరారు. సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. 104 వాహనాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు ప్రాతిపదికన ఆరోగ్య శాఖలో నియమించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు



మాసపేట సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మిడుతూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య సూచించారు. మంగళవారం మిడుతూరు–2 , కడుమూరు, మాసపేట సచివాలయాలను తనిఖీ చేశారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించడంతోపాటు పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కడుమూరు సర్పంచ్ జీవరత్నం, పంచాయతీ కార్యదర్శులు కళ్యాణ్ సింగ్, వినోద్, శ్రీధర్ ఉన్నారు.

పకడ్బందీగా పశుగణన చేయాలి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పశుగణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో పశుగణన కార్యక్రమం వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే విడుదల చేశారు. తప్పులతడకగా జాబితాను తయారు చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు షణ్ముకరాజు, అసిస్టెంట్ మనోహర్, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. మంగళవారం పట్టణంలోని 4వ వార్డులో పారిశుద్ధ్య పనులను ఆమె పరిశీలించారు. పట్టణంలో ప్రతి వార్డు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అపరిశుభ్రంగా ఉంటే రోగాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

భవనాశి నది విస్తరణకు మోక్షమెన్నడో..?

- నీట మునుగుతున్న పంట పొలాలు
- ఏటా తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- చొరవ చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు
- 2019లో కాసుల కోసమే నీరు చెట్టు పనులు



విస్తరణకు నోచుకోని భవనాశి వాగు



నీట మునిగిన భవనాశి నది పక్కన ఉన్న పంట (ఫైల్)

పాములపాడు: వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగితే భవనాశివాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. నల్లమల అటవీ ప్రాంతమైన సిద్ధాపురం, బైర్లూటీ, తదితర ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు భవనాశిలో కలుస్తుంది. దీంతో వాగుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలు పూర్తిగా నీట మునగడం సర్వసాధారణంగా మారింది. దీంతో పంటలు చేతికందక రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంటుంది. ఏటా ఇలాగే జరుగుతున్నా రైతన్నలు ఏమి చేయలేని పరిస్థితి. పాలకులు, సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యం. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల రాజకీయ నాయకులు చెప్పేమాట ఒకటే ‘మేము అధికారంలోకి వస్తే భవనాశి విస్తరణ పనులు చేపడతాం’. ఇది ఎన్నికల హామీగానే మిగలడం తప్ప పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదు. మండలంలోని ఇస్కాల, చెలిమిల్ల, లింగాల గ్రామాలకు చెందిన పొలాలు భవనాశివాగు ఇరువైపులా ఉన్నాయి. ఎక్కడ నీటి సౌకర్యం ఉంటే అందరూ అదృష్టంగా భావిస్తారు. కానీ ఈ ప్రాంత రైతాంగానికి మాత్రం భవనాశి శాపంగా మారింది. చిన్నపాటి వర్షానికే పొలాల్లోకి నీరు వచ్చే పరిస్థితులున్నవేళ భారీ వరదలు వస్తే గ్రామాల వద్దకు నీరు చేరడం, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటం సర్వసాధారణంగా మారింది. భవనాశి పక్కనే సుద్దవాగు ఉంది. ఈ రెండు వాగులకు నల్లమల అటవీ ప్రాంతం నుంచే వర్షపు నీరు ప్రవహిస్తుంది. దీంతో నీటి ప్రవాహం ఉధృతమై పొలాలు నీట మునగడం, వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి చేరుకోవాలంటే నీటిలో పుట్టీల సహాయం తీసుకోవాల్సి వస్తుంది. లేకపోతే ఆత్మకూరు మీదుగా దాదాపు 25 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ వాగుల కింద 3 వేల ఎకరాల పొలం సాగులో ఉంది. మొక్కజొన్న, కొర్ర, పొద్దుతిరుగుడు, మినుము, మల్బరి, తదితర పంటలు ఎక్కువగా సాగు చేస్తారు. ఈ మూడు గ్రామాల రైతుల కష్టాలు పాలకులకు, అధికారులకు పట్టనట్టుగానే ఉంది. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతన్నలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కౌలుకు సాగు చేసే రైతుల పొలాలు నీట మునిగితే వారి పరిస్థితి వర్ణనాతీతం. మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో వాగులు, వంకల్లోని చెట్లు, ముళ్ల పొదలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేయాలని అధికారులు చెప్పడమే మినహా ఇలాంటి వాగులు చూస్తే వారెంత వరకు ఆచరణలో పెడుతున్నారో అర్థం అవుతుంది.

గుత్తేదారులకు ధనార్జన కోసమే నీరు–చెట్టు

2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు చెట్టు కింద పనులు చేసినప్పటికీ కేవలం గుత్తేదారులకు, అధికారులకు కమీషన్ల కోసం చేపట్టినవిగా రైతులు అప్పట్లోనే బహిరంగంగానే విమర్శించారు. అవేమి అప్పట్లో ప్రభుత్వానికి, అధికారులకు పట్టనట్లుగానే వ్యవహరించారు. ప్రస్తుతం భవనాశివాగుకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పొదల్లో అడవిపందులు ఉండి రాత్రి వేళల్లో పంటలపై దాడి చేసి రైతులకు మరింత నష్టాన్ని కలిగిస్తున్నాయి. అంతే కాకుండా నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. ఏది ఏమైనా ఈ మూడు గ్రామాల రైతన్నల దృష్ట్యా భవనాశి వాగు విస్తరణ పనులకు మోక్షం కలిగించి పంటలు నీట మునగకుండా కాపాడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సంవత్సరం వేసవిలోనైనా పనులు ప్రారంభిస్తారా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఈ విషయంపై పలుమార్లు ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. వారు వచ్చి చూస్తారు. పంటలు మునిగినప్పుడు చూసి అయ్యో రైతులు తీవ్ర నష్టపోతున్నారు అనడం తప్ప చేసిందేమి లేదు. ఎస్ఆర్ఎంసీ విస్తరణ పనుల్లో కూడా భవనాశిని కొంత మేర పూడ్చారు. దీంతో నీటి ప్రవాహం సరిగాలేదు. ప్రతి సంవత్సరం నష్టపోతూనే ఉన్నాం

–నారాయణరెడ్డి, రైతు, చెలిమిల్ల

ఇన్‌లెట్ చానల్ ఏర్పాటు చేయాలి



రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న భవనాశి వాగును శ్రీశైలం కుడి ప్రధాన కాలువలోకి ఇన్‌లెట్‌చానల్ ఏర్పాటు చేయాలి. దీంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాగు నీటిని ఎస్ఆర్ఎంసీలోకి విడుదల చేయవచ్చు. దీంతో ఎవరికీ తీవ్ర నష్టం ఉండదు. ఎస్ఆర్ఎంసీ కాలువకు పక్కనే భవనాశి వాగు ఉండడం వల్ల ఖర్చు కూడా తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ విషయం ఏళ్లగా చెబుతూనే ఉన్నాం. ప్రజాప్రతినిధులు పెడచెవిన పెడుతున్నారు.

–వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకుడు, లింగాల

ఏటా తీవ్ర నష్టం



భవనాశివాగు కింద సాగులో ఉన్న పొలాల్లోకి ఏటా వర్షాలప్పుడు నీరు చేరుతూనే ఉంది. మేము తీవ్రంగా నష్టపోతూనే ఉన్నాం. ఎప్పుడో ఒకసారి పంటనష్ట పరిహారం రాస్తారు. ఇచ్చే అరకొర పరిహారం వచ్చే నాటికే పుణ్యకాలం కాస్త గడిచిపోతుంది. విస్తరణ చేపడితే ఈ కష్టనష్టాలు తప్పుతాయి. అధికారులు ఎందుకు ఆ రకంగా ఆలోచన చేయడంలేదో అర్థం కావడంలేదు.

–మనోహర్‌రెడ్డి, రైతు, ఇస్కాల

నాయకుల జేబుల్లోకి నీరు చెట్టు పనులు



భవనాశి నది ఒడ్డున 5 ఎకరాల పొలం ఉంది. ఏటా వర్షాకాలంలో భవనాశి పొంగడం, పొలం మునగడం, పైరు నాశనమవ్వడం, తీవ్రంగా నష్టపోవడం జరుగుతూనే ఉంది. నీరు చెట్టు పనుల వల్ల భవనాశిలో పనులు చేస్తున్నారంటే సంబరపడ్డాం. కాలువ విస్తరణ చేయకుండా తూతూ మంత్రంగా కాలువలో మట్టి తీసి టీడీపీ నాయకులు జేబులు నింపుకున్నారే తప్ప రైతులకు ఒరిగిందేమి లేదు.

–లచ్చలగౌడు, రైతు, చెలిమిల్ల

క్షేత్ర పాలకుడికి పూజలు



పూజలందుకున్న వీరభద్రస్వామి



ప్రత్యేక అలంకరణలో కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామివారికి, నగసల బసవన్నగా పేరొందినన నందీశ్వరునికి మంగళవారం సందర్భంగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు.

కుమారస్వామికి..

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామికి మంగళవారం అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. అభిషేకం, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

ఆశావర్కర్లకు అవగాహన

జూపాడుబంగ్లా: గర్భిణులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు, సూచనలిస్తూ సుఖప్రసవం అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆశాకార్యకర్తలపై ఉందని హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా జూపాడుబంగ్లా పీహెచ్‌సీ పరిధిలోని ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలు ప్రెగ్నెన్సి కిట్టు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో వయస్సును అనుసరించి పెరుగుదల, బరువును నిర్ధారించడంతోపాటు తల్లులు బలవర్ధకమైన పౌష్టికాహారం భుజించేలా అవగాహన కల్పించాలన్నారు. చిన్న పిల్లల్లో నిమోనియా వ్యాధి వ్యాప్తి, లక్షణాలను వివరించి వ్యాధిబారిన పడిన చిన్నారులకు చికిత్స చేయించుకునేలా తల్లులకు సూచనలివ్వాలన్నారు.

ఇంటి పట్టాలు ఇవ్వాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఆర్ నగర్ వాసులు

నందికొట్కూరు: గుడిసెలో నివాసం ఉంటున్న పేదలకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ డివిజన్ నాయకుడు లాజరస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరులో మాండ్ర స్వగృహంలో ఎమ్మెల్యే జయసూర్యకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఆర్ నగర్‌లో 15 ఏళ్ల నుంచి పూరి గుడిసెలో నివాసం ఉంటున్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి



వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని 80 బన్నూరు, పోతులపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడొద్దన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

డిసెంబర్ 15లోగా ప్రీమియం చెల్లించాలి

కొత్తపల్లి: పంటల బీమా ప్రీమియంను రైతులే చెల్లించాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకి బీమా పరిహారం పొందాలంటే బీమా ప్రీమియం తప్పకుండా చెల్లించాలన్నారు. పకృతి విపత్తులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితుల్లో పంటలు నష్టపోయినప్పుడు బీమ పరిహారం అందుతుందని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వైద్యురాలికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

నందికొట్కూరు: ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు కోరారు. మంగళవారం బ్రాహ్మణకొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలికి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్డు అయిన ఆశావర్కర్లకు పింఛన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ నెల 18వ తేదీ నంద్యాల కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకుడు ఉస్మాన్‌బాషా, ఆశా వర్కర్లు అలివేలమ్మ, సునీత, మహాలక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

జూపాడుబంగ్లా: ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పారుమంచాల ప్రాథమిక వైద్యకేంద్రం డాక్టర్ యశశ్వినికి వినతి పత్రం అందజేశారు. ఆశావర్కర్ల పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు. సీఐటీయూ నాయకురాలు రజియాబీ, కర్ణ పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



బ్రాహ్మణకొట్కూరులో అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

నందికొట్కూరు: మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించాలని తెలిపారు. ఎస్ఐ తిరుపాలు, పోలీసులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త రామకృష్ణారావు

మిడుతూరు: సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నంద్యాల ప్రాంతీయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.రామకృష్ణారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జలకనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేయాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఓ పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

భ్రమరాంబా మల్లికార్జునలకు ప్రత్యేక పూజలు



స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునలకు ప్రత్యేక పూజలు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించి, మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి షోడశోపచార పూజలు జరిపారు. అలాగే భ్రమరాంబాదేవికి ఊయలసేవ నిర్వహించారు.

మహానందీశుడి దంపతులకు కల్యాణం



మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి దంపతులకు మంగళవారం కార్తీకమాసం పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆంజనేయ శర్మ, హనుమంతుశర్మ, నాగేశ్వరశర్మలు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను కొలువు తీర్చి వేదమంత్రోచ్చారణలతో వేదోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

గ్రామ సభకు 110 దరఖాస్తులు

బండి ఆత్మకూరు: మండలంలోని సంతజూటూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభకు 110 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ధోని ఆల్‌ఫ్రెడ్ తెలిపారు. మ్యుటేషన్‌కు 34, జాయింట్ ఎల్‌పీఎం కోసం 31, విస్తీర్ణంలో మార్పునకు 43, పట్టాదార్ పాస్ పుస్తకాలకు 2 దరఖాస్తులు అందాయన్నారు. వీటినంత త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ప్రతి కార్యకర్త పని చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్

ఆత్మకూరు: పార్టీ కార్యకర్తలు ప్రజల సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్ సూచించారు. మంగళవారం పార్టీ పట్టణ మూడవ మహాసభ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు, గౌడ్ సెంటర్, స్టేట్ బ్యాంక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రాంతాల వారీగా ప్రజల తాగు నీటి సమస్య, రోడ్లు, డ్రెయినేజీలు తదితర సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు ఎం.రాజక్, పుల్లమ్మబాయి, ఎ.రణధీర్, ఎ.సురేంద్ర, జి.నాగేశ్వరరావు, షేక్‌ఇస్మాయిల్, సద్దాంహుసేన్, దినేష్, ఎన్.స్వాములు, మంజుల, సువర్ణమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డివిజన్ అధ్యక్షుడు మహబూబ్‌బాషా కోరారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆయన మాట్లాడారు. ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. విద్యాసంస్థలు బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని లేకుంటే ఇచ్చేది లేదని తేల్చి చెబుతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు. విద్యా సంవత్సరం ఐదు నెలలు గడిచినా అమ్మ ఒడి ఇవ్వకుండా చేతులు ఎత్తేయడం దారుణమన్నారు. విష్ణు, సాగర్, విజయ్, అశోక్ పాల్గొన్నారు.

జైగౌడ నూతన కార్యవర్గం

- జిల్లా అధ్యక్షుడిగా పిట్ట ఎల్లగౌడ్



ఎల్లగౌడ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌గౌడ్

నందికొట్కూరు: గౌడ్ కులస్తుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం జైగౌడ సంఘం పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జువ్వాజీ చంద్రశేఖర్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జై గౌడ్ సంఘం కార్యాలయంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా పిట్ట ఎల్లగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా తూడిచర్ల నాగేంద్రం గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భీమ్‌గౌడ్, నందికొట్కూరు తాలుకా అధ్యక్షుడిగా వెంకటేష్‌గౌడ్, పాములపాడు మండల అధ్యక్షుడిగా శంకర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్లగౌడ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా సూర్యనారాయణ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన పీఠాధిపతి వీరకృష్ణభగవాన్ శర్మ

మహానంది: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఏలూరు జిల్లా అగిరిపల్లి శ్రీకృష్ణ దుర్గ స్వధర్మ సాధనం పీఠాధిపతి వీరకృష్ణ భగవాన్ శర్మ అన్నారు. శిష్యబృందంతో కలిసి మంగళవారం మహానందీశ్వరస్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానందీశ్వరుడు మహిమాన్వితుడన్నారు. ఆలయ అర్చకులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

అధిక దిగుబడులు సాధించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు



కంది పంటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ

ఆత్మకూరు: అధికారుల సూచనలు పాటించి తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలని వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి రాజశేఖర్ రైతులకు సూచించారు. ఆత్మకూరు, బాపనంతాపురం గ్రామాల పరిధిలోని పొలాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో సాగైన మినుము, వరి, శనగ, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. 33 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు అందిస్తున్నామన్నారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ ఎంపీఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రీమియం రైతులే చెల్లించాలి

బండిఆత్మకూరు: రబీ సీజన్‌కు సంబంధించిన పంట బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వాతి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నారాయణపురం చిన్నదేవళాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి డిసెంబర్ 30లోపు, మెట్ట పైరుకు డిసెంబర్ 15లోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు.

కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వెలుగోడు: కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ పవన్ కుమార్ సూచించారు. మండలంలోని అబ్దుల్లాపురం గ్రామ సమీపంలోని పొలంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. పైరును ఆశించే పురుగు, తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న కంది పైర్లకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందన్నారు. అప్రమత్తంగా ఉండి క్రిమిసంహారక మందులను సరైన మోతాదులో పిచికారీ చేసుకోవాలన్నారు.